కోరలున్న యీ రాత్రి చిక్కగా నిలబడిపోయింది. సత్యనారాయణ జీవితంలో అనేక రాత్రులు గడిచేయి. కాని ఈ ప్రళయ రాత్రిలో ఒక భయంకరమైన ప్రత్యేకత ఒక అనిర్వచనీయమైన భయం గూడుకొని పేరుకున్నాయి. ఈ భారమైన రాత్రి తొలగిపోవాలి. జనపతెరలాంటి యీ దళసరి చీకటి కరిగి పాలలాంటి వెలుగు ప్రవహించాలి. అప్పుడే సత్యనారాయణకి మోక్షం. జీవితపు చీకటి దారులమధ్య చేరిన సత్యనారాయణకు యీ రాత్రే ఒక భావి_ఒక బాట నిర్ణయిస్తుంది. అతని జీవిత నౌక యీ పెనుతుఫాను తప్పించుకొని దరిచేరడమో, లేక యీ సుడిగాలిలో విరిగి చెక్కలై పోవడమో యీ రాత్రే నిర్ణయిస్తుంది. ఈ రాత్రి నిక మోయలేక సహిస్తున్న సత్యనారాయణ చీకటి ఎడారిలో సాగిపోతూనే వున్నాడు.

"యీ సీకట్లో నేన్రాలేన్రా సత్తెం, ఏలనుకెళ్ళి నువ్వే సూసుకురా" అన్న రాజమ్మ మాటలు అతన్ని వెంటాడుతూనే వున్నాయి. రైలుస్టేషన్లో ట్యూబు లైట్లన్నీ కలిసినా అతన్ని అలుముకుంటున్న చీకటిని చింపలేవు. ప్రపంచం లోని అన్ని రైళ్ళూ ఒక్కసారి కూసినా అతని హృదయ ఘోషని మించలేవు.

ముందుకు దూసుకుపోతున్న సత్తెన్నారాయణ మనసులో జీవితపు పుటలు వెనక్కి తిరుగుతున్నాయి.

ఐదేళ్ళకిందట పలుచని వెన్నెల్లో,



# బీనాదేవి

నిర్జీవమైన హరికెన్ లాంతరు ఎర్ర వెలుగులో, మునసబు రావయ్య యింటి ముందు, ఆశ ఫలించగా వచ్చిన నీరసం వల్ల గోడకు చేరబడిపోయిన రాజమ్మను "మరైతే ఏం చేస్తావే నీ మనవణ్ణి?" అని రావయ్య అడిగేడు. భయంతో గోడకు కరుచుకుపోయిన సత్తెన్నారాయణ యింకా గోడలోకి పొదుక్కుపోయేడు. జీవిత ప్రవాహంలో సునాయాసంగా కొట్టుకుపోవడమో, లేక తిరగబడి ఎదురీదటమో నిశ్చయించుకోలేని రాజమ్మ పెదవి విడలేదు.

"సీకేంవే! చదివించు పైకి"


ప్రోత్సహించేడు రాఘవయ్య. ఐనా మాటాళ్ళేదు రాజమ్మ. దాంతో మరీ ఉత్సాహంతో, "చదివించు పైకి. నీకైనా ఏ వంత పదిమందున్నారనీ ? మిగిల్నవాడల్లా వాడొక్కడేగా ? చదివించ్చుదివించు" అని మొండిగా ప్రోత్సహించేడు రావయ్య.

దాంతో రెచ్చిపోయింది రాజమ్మ. "ఏటి సెప్పను మునిసీబ్బాబూ ? నాబతుకిలా ఎండి మండిపోద్దనుకోనేదు. కట్టుకున్నోణ్ణి కాల్చేసుకున్నా. కన్నకూతుర్ని కాల్చేసుకున్నా. ఇందరు సచ్చినా నాకుసావురానేదు. నా కోసరం కాదు బాబూ నేబతికేది. మిగిలున్న ఆ నలుసు కోసరం" అని ఆగింది ఆప్యాయత్తో సత్తెన్నారాయణ్ని చూస్తూ. మళ్ళీ కట్టుకున్నవాడు జ్ఞాపకం రాగానే "అకి కేం ఆడుపోనాడు. నా మెళ్ళకీ బందాలన్నీ సుట్టేసి. ఆడుసేసిన అప్పులే తీరసమంటావా ? మిగిల్నొక్కడికీ అచ్చరమ్ముక్కే సెప్పించమంటావా ? నువ్వేసెప్పు ! ఇంతకీ యీడు సదువుకునేటి సేస్తాడంటావ్ ? ఉద్దేగాల్సేస్తాడా ? ఊళ్లేల్తాడా ? నా నీద నేను మునసబ్బాబూ యీ మొండి బతుకు. ఏటుందని సెప్పించమంటావ్ సదువు. ఏటుందని సెప్పించనీడికి సదువ్ ? నీకు తెలద్దేటుంది గనక ? కమిసను కొట్టుకి బెల్లం తోల్నేదని సెప్పి సావుకోరు ఒడ్డీలకి ఒడ్డీలు కట్టినాను. పేగుల్సింపుకుని కట్టిన సెల్లులు సూపక కోరటు కీడ్సినాడు. ఆడి జివ్వండ—ఆడి కెలా అరుగుద్దో యీ అన్నేయ పార్జన. ఏటంటే ఏం నాబం ? ఇపు డెంతేడ్సి ఏం నాబం ? ఇయేలో రేపో ఆ తూరుపొలం డప్పుకొట్టి పాట్ట నెట్టేసుకుంటాడు సావుకోరు. ఇకేటి మిగులుద్ది నాకు ? మూల పొలం ముపాపతికా ! అంతేనా ! అందిమీ దొచ్చేదేటి? నాకు మిగిలేదేటి ? దాంట్లో నీకు పన్నులే కట్టమంటావా ? కరణమయ్య కట్నాలే సదించమంటావా ? బేపనయ్య బాకీలే సెల్లు పెట్టమంటావా ? సత్తుంకు సదువే సెప్పిచ్చమంటావా ? ఇన్నిబోతే నా కేటి మిగులుద్ది. నువ్వే సెప్పు నాన్నగోరూ, ఎండుగడ్డీ ఏరుకున్న గింజలూ తప్ప. ఏటుందని సత్తేన్ని కాలేజీలో ఎట్టమంటావ్ ? ఆగిపోయింది రాజమ్మ.

నిలదీసి అడిగిన రాజమ్మను బుజ్జగించేడు రావయ్య. "మేవంతా లేవుటే ? అమ్నుంచి నరుక్కొద్దాం. లక్షణంగా చదువుకుంటున్న వాణ్ణి మానిపించేస్తానంటావేంటే నువ్వు ? వెనకాడక ముందు నువ్వు వాడిని కాలేజీలో చేర్చు. తర్వాత చూద్దాం. ఇంతకీ మా రాంబాబు కూడా తోడుంటాడుగా వాడికి. వాడేం ఒంటిగాడు కాదులే."

సత్తెనారాయణ ఎస్సెల్సీ పేసైన రాత్రి జరిగిన ఈ సంభాషణ అతన్ని తొట్రుపాటుతో కాలేజీలోకి నెట్టింది. తనపల్లెకి రెండుమైళ్ళ దూరంలో వున్న పట్టణంలో కాలేజీలో చేరేడతను.

నాలుగు నూలు చొక్కాలతో, మూడు చిరిగిన రంగు పంట్లాలతో,



రాంబాబు పుస్తకాలతో, మధ్యాన్నం మందే కడుపుతో, దినానికి నాలుగు మైళ్ళ నడకతో, జీవితంలో ఒంటరితనంతో, పెరగని రాంబాబు పరిచయంతో పి. యు. సి. గడిచిపోయింది. రాంబాబు, సత్తెనారాయణా ఫస్ట్ క్లాస్‌లో ప్యాసయ్యేరు.

ఆ సంవత్సరంలో సత్తెనారాయణ చూసిన సినీమాలు రెండు — అమెరికా గవర్నమెంటు ఖర్చుని. ఆ సంవత్సరంలో అతను కేంటీనుకెళ్ళింది మూడు సార్లు. మూడుమాట్లూ రాంబాబు ఖర్చునే.

సత్తెనారాయణ పి. యు. సి. పేసయ్యేక ఎవరి సలహా లేకుండానే అతన్ని బి. యే. లో ప్రవేశపెట్టింది రాజమ్మ. బి. యే. ప్యాసైతే "సబిన్స

పెట్రు పనిస్తారని ఎవరో అనగా ఎప్పుడో విందామె.

ఒకప్పుడు హెడ్ కానిస్టేబులుద్యోగం ఆమె దృష్టిలో బహుదొడ్డది. అల్లప్పుడు కలకత్తా మెయిల్ కింద పడి చచ్చిపోయిన "మైనర్రాజా గోరి" అంటు మామిడితోటలో, "కాలుజారిన' చిట్టెమ్మ కూతురు ఉరిపోసుకుని చచ్చిపోయినప్పుడు. చిట్టెమ్మని ఖైదులో తోసిందీ హెడ్డే. మూడువందలు పుచ్చుకొని బైటకు తీసిందీ ఆ "ఏడ్డుబాబే."

"సంకురాత్తిరి" పండక్కి "సుక్కెక్క వేసుకున్న" మంగమ్మ మొగుణ్ణి కబందుళ్ళాటి "కనిస్టేబు" పట్టుకుంటే పదుచ్చుకు "ఒగ్గేసిందీ ఆ ఏడ్డుబాబే". అంచేత తల్చుకుంటే తపస్సు మినహా హేడ్డుకి చేతకాందేదీ లేదు రాజమ్మ దృష్టిలో. కాని ఇదంతా —

ఒకనాడు పాతబాకీ తీర్చనందుకు, తనని కొట్టించే కొట్టేడని, తిట్టందే బూతులిట్టేడనీ, ప్రమాదవశాత్తు తన పశువుల పాక తగులడిపోతే కావాల్నే దానికి నిప్పు పెట్టేడనీ, బడ్డీకొట్టు బసవయ్య రౌడీ కోడిగాడిమీద "అబద్ధీకపు రిపోరుటు" హేడ్డు కిచ్చేడు. హేడ్డు కూడా "నంచం కతికేసి న్నేయం అన్నేయం" అన్నది లేకుండా గొడ్డుని బాదినట్టు కోడిగాడ్ని బాదేసి "ఎస్టీవోడి స్టంటులా" వాణ్ని కుళ్ళబొడిచేస్తూ వుంటే, వాడు వేసిన కేకలు "సీతామ్మోరి దుక్కం నాగ" ఊర్ని ఉడకబెట్టేసినాయ్." ఆ కేకలికి "ఇనసపెట్రుబాబు పేళనుకి పరిగెత్తి కెళ్ళి ఏత్తు యాప్మి దీళ గుద్దోటి గుద్ది కోడిగాణ్ణి యిడదీసీక పోతే కోడిగాడు ఆడి గాబుల్లో కలిసిపోయుండును." అంతే కాకుండా కోడిగాడి "మాటిని, ఆడినాయెం కనిపెట్టేసి ఆణ్ణి ఒగ్గేసి, తప్పుడు కేసిచ్చినందుకు బసవయ్య మీద కేసెట్టి ఆణ్ని జైలుకి కట్టేనాడు దరమరాజా ఇనసపెట్రుబాబు."

ఈ ఉదంతం కోడిగాడి ముఖతః విన్నప్పట్నించీ రాజమ్మ దృష్టిలో "ఏత్తు పొట్టైలైతే ఇనసపెట్రుబాబు పులి. ఆడు పులైతే యీను సింవం"గా మారి, కొండంత హేడ్డూ ఆర్నెల్లకింద చచ్చిన శవంలా కుష్కించి పోయేడు. ఇదంతా జరిగి "మొన్న కొత్తామాసకి నాలుగోయేడు పొరబడ్డది." అప్పట్నించీ "సత్తుం" ఇనస్పెక్టరైతే యీ "ఔశారం సాలించేద్దామని" రాజమ్మ అనుకుండేది. ఆమె అలా అనుకున్నదాని ఫలితమే సత్తెన్నారాయణ బి. యే. చదువు.

సత్తెనారాయణ బి. యే. చదివిన మూడు సంవత్సరాల్లోనూ మూడుసార్లు ఆడపిల్లలు కోరుకొని అతన్తో మాటాడేరు. తమకేవో ఓట్లివ్వమని. ఆ మూడు సంవత్సరాల్లోనూ అతన్తో ప్రిన్సిపాలుగారు రెండుసార్లుమాటాడేరు. మిగతా పిల్లలు చేసే స్ట్రయికులో పాల్గొంటే "ఫీ" కన్సెషను తీసేస్తామని చెప్పడానికి.

ఆ మూడు సంవత్సరాలూ రాజమ్మ చెమటోడ్చింది. ముసలి సంయుక్తలా నడుం బిగించింది. కత్తిపట్టిన ఝాన్సీ

లక్ష్మిలా లక్ష్యసాధనలో తానుఅహుతై పోడానికి సిద్ధపడింది.

ఆ మూడేళ్ళూ ప్రతిరోజూ చీకటున్నా వానొచ్చినా తెల్లవారుఝామున మూడింటికి లేచేది. సంగీత సాధనకి మాత్రం కాదు. "కోసెడు దూరం స్మెస్సేనం మలుపు ఒరుకు" పోయి పేడ ఏరి తెచ్చి వారానికి "యెయ్యోరె బాబూ యెయ్యి" పిడకలుపెట్టి అమ్మి. ఊరు గొడ్లపాలన్నీ "కమిసను డబ్బులిక్కా" టౌన్లో కాళ్ళరోళ్ళైపోయే వరకూ తిప్పి తిప్పి అమ్మి. దంపుడు బియ్యం దుకాణంలో "వారానికి ఏడు బస్తాలు-రోజుకో బస్తాలెక్కని" దంపి దంపి. "జంక్సనుకాడ కేపేసుకాణంలో" రోజుకి కుంచెడు మినపప్పు రుబ్బి రుబ్బి. అంట్లు తోమి, అగచాట్లుపడి, తాను సున్నమై ఎద్దుల్లో ఎద్దయి "బా దేవత్తో కుమ్ములాడి," పండించుకున్న పదిగింజల్తో "సత్తుంని మూడు పూట్లకో పూట పస్తెట్టి," సత్తెన్నారాయణ్ని చదివించింది రాజెమ్మ.

సత్తెన్నారాయణకి సబిన్సపెక్టరౌదామనీ. సూపరెంటౌదామనీ లేదు. కనీసం కలెక్టరౌదామనన్నా లేదు. అతనికి కోరికల్లేవు. వాంఛల్లేవు. భావి జీవితం గురించి గులాబీ కలల్లేవు. అతనికున్న ఒక్క ఆశయమూ బీయ్యే ప్యాసౌదామనే. తాను ప్యాసైతే రాజమ్మ కళ్ళల్లో నీటి ముత్యాలు చూద్దామనీ, ఆమె మొహంలో మెరిసే మెరుపులు చూద్దామని కూడా కాదు. తన పరీక్ష పోతే ఆమె మొహం చూళ్ళేడు. ఆమెకు తన మొహం చూపలేడు. తన పరీక్షపోతే రౌడీ వెధవ రామచిలుక పీక పిసికేసినట్టూ, పసిపిల్లను మంటల్లో తోసేసినట్టూ వుంటుంది రాజమ్మకు. రాజమ్మ బాధ తను చూళ్ళేడు. తన మట్టుకు తను పోషించుకోలేక కాదు. రాజమ్మ క్కావలసిన "మూడు ముద్దలూ" సంపాదించలేక్కాదు. పసిపిల్ల ఆడుకుంటున్న గాజు బొమ్మని తోలు జోడుతో తొక్కి పిండి చేసినట్టూ, యుద్ధానంతరం సైన్యంలోని తండ్రిరాక కెదురు చూస్తున్న పిల్లతో "మీ నాన్న చచ్చి పోయేడని" చెప్పినట్టూ వుంటుంది. రాజమ్మతో తన పరీక్ష పోయిందని చెప్పడం, అంతకంటె తన పరీక్ష పోయిన పక్షంలో "సత్తుంబాబూ! నీ పరిచ్చ పోతే నాను ఏటొడ్డు పాణ్ణూతిలో పడాల్సిందేరా బాబూ" అని ఆమె అనే పాడు నూతిలో ఆమెను తోసేస్తే ఆమె పట్ల దయచూపిన వాడౌతాడు.

సత్తెన్నారాయణెప్పుడూ రాజమ్మకి ద్రోహం చెయ్యలేదు. నేటివరకూ ఒక్క క్లాసూ తప్పలేదు. ఈ బి. య్యే. పరీ

---

★ గయోపాఖ్యానం నాటకం జరుగుతోంది. గయుడు, నారదుడు ఇద్దరూ మొదటిసారిగా స్టేజిమీదికి వచ్చినవారే. ప్రేక్షకులను చూసి గయుడు వణికిపోతూ "నాదరా!" అని తడబడ్డాడు. దాంతో నారదుడు కంగారై గజగజలాడిపోతూ "భయుడా! గయము వలదు" అన్నాడు.

క్షకి, గుడ్డి రాక్షసుడి ఒంటికన్నులా వుండే బుడ్డిదీపం దగ్గర "రేత్తిరి మలి కోడి కూసే"దాకా చదివేవాడు. తన వయసువాళ్ళకు కలిగే కోర్కెలు తనకి కలక్కుండా వాటిపీక నొక్కి చంపే శేడు. "నన్ను సబిన్స్పెక్టరూ చెయ్యక్కర్లేదే, సూపరెంటూ చెయ్యక్కర్లేదే. జీవితంలో యీ తుదిపరీక్ష నెగ్గించు భగవాన్" అని, చావు బతుకులమధ్య తనకున్న ఒక్కతల్లినీ బతికించమనే ఎనిమిదేళ్ళ పిల్లలా దీనాతిదీనంగా ప్రార్థించేడు.

"పరీచ్చెల్తే సత్తుంని సివాంచలం కొండకి అంప్తతా" అన్న రాజమ్మ మొక్కు చెల్లిస్తానని ఒప్పుకున్నాడు. "మూడూళ్ళ ముట్టెత్తి నీ కొండకొచ్చి జుట్టిచ్చేస్తా వెంకటేశ్వరా" అని తనూ మొక్కుకున్నాడు.

* * *

మెదళ్లో చిక్కుపడే ఆలోచనల్తో, తడితో చీకటిగా వున్న మేఘాలక్రింద, పొంచున్న పులుల్లా వున్న చెట్లమధ్య, లేనిధైర్యం తెచ్చుకుంటూ, సాధ్యపడని సాహసాన్ని సాధిస్తూ నడిచిపోతున్నాడు సత్తెన్నారాయణ.

తడిసిన నల్ల తోలుముక్కల్లా తేలుతున్నాయి మేఘాలు.

రాక్షస సంతర్పణలో కూర్చున్న ముసలి రాక్షసుల్లా వున్నాయి రోడ్డు ప్రక్క చెట్లు.

మీదనున్నవాళ్ళ పాప భారానికి కుంగిపోయి చెయ్యెత్తితే అందేట్టుంది ఆకాశం.

రైలుస్టేషను చేరేక గుర్తొచ్చింది సత్తెన్నారాయణకి, తను డబ్బు మరిచిపోయేనని. "ఛీ! అపశకునం" అనుకుంటూ థర్డ్ క్లాస్ వెయిటింగ్ హాల్లో బెంచీమీద కూలబడి పోయేడు.

అప్పటికప్పుడే మెయి లొచ్చేసింది, సత్తెన్నారాయణ గుండెలా చప్పుడు చేస్తూ. గొంతులో కొట్టుకొనే గుండెతో, ఏ క్షణాన రక్తం వత్తిడికి పగిలి పోతాయో అనిపించే నరాల్తో, భయానికి వంకర్లుపోయే ఎముకల్తో, ఆశ నిరాశల కత్తెర్లో తెగిపోతున్న హృదయంతో, తనకి తెలిసిన స్టూడెంట్లెవరైనా న్యూస్ పేపరు తెస్తారేమోనని ఎదురుచూస్తూ కూర్చున్నాడు సత్తెనారాయణ.

అతనికి తెలిసిన వాళ్ళు చాలామంది చాలా పేపర్లు తెచ్చారు. "నీకేం వింటోయ్! ఫస్ట్క్లాస్ కేండిడేటువి" అంటున్న ఒకరి దగ్గిర పేపరు పుచ్చుకున్నాడు. వణుకుతున్న చేతుల్తో పేజీలు తిరగేసి బెదిరిపోయే కళ్ళతో



అత్రంగా చూసేడు. ఏవో అర్థంకాని నంబర్లు _ గుర్తులేని అంకెలు అతని కళ్ళముందు తిరిగి పోతున్నాయి.

ముగ్గురు దేముళ్ళకూ దయ నిండు కుంది.

ముక్కోటి దేవతలకూ కరుణ కలగలేదు.

సింహాద్రి అప్పన్న అంకెలు వేశేడు. భూదేవి, శ్రీదేవీ సమేతుడైన శ్రీనివాసునికి సత్తెన్నారాయణ జాట్టక్క ర్లేకపోయింది.

సత్తెన్నారాయణ నంబరు పేపర్లో లేదు.

* * *


"ఎక్కడా తెలకుండా కుట్టేసినా డొరె డాక్టరు_పెద్ద సెయ్యి" అన్నారు. అంతా మెయిల్ కింద పీకపెట్టి చచ్చి పోయిన సత్తెనారాయణ శవాన్ని పంచాయితీ, పోస్టుమార్టమ్ ఎగ్జామినేషనూ అయ్యేక రాజమ్మకి యిచ్చినప్పుడు.

* * *

ఇది జరిగిన రెండు రోజులకు.... విసిరేసిన ఎంగిలాకుల్లా ఊరవతల వున్న రాజమ్మ గుడిసెలో,

ఏదో అడవిలో జీర్ణశిథిలాలయంలో అజ్ఞాత భక్తుడు వెలిగించిన దీపకళికలా వెలుగుతున్నది ప్రమిదలోని వత్తి.

ఎన్నో శతాబ్దాలువెనక సుందరంగా మలచబడి. ఎండపేల్చగా, వానచీల్చగా,



గాలికోసేయగా మిగిలి, అన్యమతస్తుల చేత విరగ్గొట్ట బడిన వికృత శిల్పంలా నేలని పడివుంది రాజమ్మ.

ఆర్నెల్లు ప్రతిరాత్రి నీ ట్లో నూ, పగలు ఎండలోనూ పెట్టిన పా త చెప్పులా వుందామె మొహం.

ఉడతలు పీకిపీకి వదలగా, ఎలకలు కొరికిన తాట్టెంకలా వుందామె జుట్టు.

బ్రతికుండగానే చెదలు తి నే సి నట్టుందామె శరీరం.

ఆమె గుడిశంతా తుప్పట్టిన ఇనప ముక్కలా వుంది.

అర్థరాత్రైనా ఆమె కంటికి నిద్ర గాని, నీరుగాని రాలేదు. ఆతృతతో వచ్చిన రాంబాబుని చూసి కూడా ఆమె కదల్లేదు.

ఆనందంతో తొట్రుపడుతూ "మన సత్తెన్నారాయణ ప్యాసయేడు రాజమ్మా! పేసైపోయేడు" అని, నిర్జీవంగా పడున్న రాజమ్మని చూసి ఒక్కసారి ఆగిపోయేడు రాంబాబు.

మళ్ళీ తనంతతానే ప్రారంభించేడు "ఏదో తప్పైందిట — యూనివర్సిటీ లోనే — అంటే కాలేజీ — పెద్దకాలేజీ లోనే ఏదో పొరపాటై పోయిందిట. పొ ర పా టంతా వాళ్ళదే! ఇదుగో యిప్పుడే పేపర్లో పడింది చూడు రాజమ్మా.... మన సత్తెం ప్యాసై పోయేడు - తప్పంతా వాళ్ళదే - ఆ కాలేజీ వాళ్ళదే, మన సత్తెం తప్పేమీ లేదు రాజమ్మా" అని రాజమ్మ కదలడం చూసి హఠాత్తుగా ఆగిపోయేడు.

రాజమ్మ బైటకువప్పుడయ్యేకీళ్ళతో లేచి గోడకి చేరబడి కూర్చుంది. బైటికి కనపడనంత లోతుగా వున్న తన కళ్ళతో రాంబాబుని తీక్షణంగా చూసి "తప్పంతా ఆడిదే బాబూ! ఆడిదే!! ఆడిపుటకే....ఆడు పుట్టడవే ఆడి తప్పు" అని చూపు మరల్చి దూరంగా నిశీథంలోకి చూస్తూ "మాలాటోళ్ళని పుట్టిన్చడవే ఆడితప్పు" అంది చెయ్యెత్తి ఆకాశం వేపు చూపిస్తూ.

***

---

## చందా దారులకు మనవి

పాత చందా దారులు తిరిగి చందా సైకం పంపే టప్పుడు మీ చందా నెంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

మేనేజరు, "జ్యోతి"

---